# స్పర్థ

వీరయ్య కొడుకు కోటయ్య. వీళ్ళిద్దరికీ స్పర్థరావటం ఊళ్ళో అందరికీ ఆశ్చర్యంగానేవుంది. చాలాకాలం వరకూ తండ్రీ కొడుకులు చాలా అన్యోన్యంగా వుండేవారు. అన్యోన్యము అంటే, తండ్రి చెప్పినట్టు కొడుకు వినేవాడు. ఇప్పుడా పరిస్థితి మారింది— ఈమధ్య వీరయ్య భార్య చనిపోవటం అతను మళ్ళీ పెళ్ళి చేసుకోవటం జరిగింది. అంతకు ముందే కోటయ్యకు పెళ్ళి అయివుంది. అప్పటినుంచీ తండ్రీకొడుకుల మధ్య స్పర్థ పెరిగింది. ఉన్న పూరిగుడిసె చెరిసగం చేసుకొన్నారు. చెరొక ఏభై రూపాయలూ పంచుకున్నారు. తన ఏభైరూపాయిలూ పెట్టి వీరయ్య వెంటనే ఒక గేదెను కొన్నాడు. అతని భార్య పాలూ, పెరుగూ అమ్మటం మొదలుపెట్టింది. అది చూచి సహించలేక, కోటయ్య భార్య పోరిపోరి, భర్తతో తమ కొక గేదెను కొనిపించింది. అప్పటినుంచి మరీ స్పర్థ ఎక్కువైంది. మేత వెయ్యటం మొదలుకొని, పాలు అమ్ముకోవటంవరకూ రోజూ తగాదాలు జరుగుతూనే ఉన్నయి.

ఆనాడు అయిదుగంటలకు లేచి గేదెకు మేత వెయ్యటానికి దొడ్లోకి వెళ్ళాడు కోటయ్య. తమ గేదెకంటె మామగారి గేదె ఎక్కువ పాలిస్తూ వుందనీ, తమ గేదెకు పోషణ సరిగ్గా జరగటంలేదనీ భార్య పోరితే, కోటయ్య అప్పటినుంచి గేదెకు తనే మేతవెయ్యటం, కుడితి పెట్టటం చేస్తున్నాడు. గేదెకు జనపకట్ట వేద్దామని వామిదగ్గరకు వెళ్ళాడు. దాని ప్రక్కనే తన తండ్రి వామివుంది. తండ్రి వామిని చూచేటప్పటికి అతనికొక దురాలోచన కలిగింది. తన తండ్రి మంచి జనపకట్టలు పోగుజేసాడు. తన గేదెకు ఆ జనపకట్ట వేస్తే—యీ

ఆలోచన తట్టీతట్టటంతోనే అతి భయంకరంగా కనిపించింది. కోటయ్యకి. నెమ్మదిగా అలవాటైనది. తన తండ్రి వామి దగ్గరకు వెళ్ళాడు. ఒక జనపకట్ట లాగాడు. రెండడుగులు వేశాడు. ఎదురుగా తండ్రి కనిపించాడు. ఎందుకనో ఆ జనప కట్టతో తండ్రిని బాదుదామనిపించింది. జనపకట్ట చేత్తో పట్టు కొని రోషంగా చూశాడు. వీరయ్య ఏమనుకున్నాడో! అక్కడనుంచి నెమ్మదిగా వెళ్ళిపోయాడు. గబగబా జనపకట్ట గేదెముందు దులిపి గుడిసెలోకివచ్చి పడుకున్నాడు కోటయ్య.

తెల్లవారే టప్పటికి ఈ సంగతి ఎట్లా తెలిసిందో వీరయ్య భార్యకు తెలిసింది. వీరయ్య యింట్లోలేడు. వీరయ్య భార్య ఈ సంగతి తెలిసీ తెలియటంతోనే దొడ్లోకివెళ్ళి కోటయ్య వామిలోనుంచి నాలుగు కట్టలు లాగి తన గేదకు వేసుకుంది. ఈ సంగతి కోటయ్య భార్యకు తెలిసి తగాదా పెట్టుకుంది.

"నీ చెయ్యి విరగా—"

"నీ మొగుడెందుకు చేశాడే ?"

"నా మొగుడు చేశాడా ?"

"మా జనపకట్టలాగి—"

"రుజువు చెయ్యి ?"

వీరయ్య భార్య ప్రక్క గుడిసెలో కాపురం వుంటున్న రత్తయ్యని పిలిచి రుజువు చేసింది. అంతా చెప్పి, "వీరయ్య మామకూడా చూశాడు." అని చెప్పాడు. అక్కడితో మరీ రేగింది కోటయ్య భార్య. మమ్మల్ని ఇంట్లో వుండకుండా చెయ్యడానికని ఈ పన్నాగం పన్నావన్నది. వాడకట్టు వాళ్ళందర్నీ కూడగట్టుకుంటున్నావన్నది. అంతా

నీపక్షం పలకక, దిక్కులేని పక్షిని నా పక్షం ఎవ్వరు పలుకు తారన్నది. నా కేమి అండా దిండా అన్నది. అక్కడితో వీరయ్య భార్య వేసుకుంది. మళ్ళీ జుట్టూ జుట్టూ వేసుకొన్నారు. వాడకట్టంతా పోగైంది. ఎవ్వరికి చెప్పేవి వారికి చెప్పి అప్పటికి సర్దారు.

కోటయ్య భార్యకు కోపం ఆగలేదు. ఇంట్లోకివచ్చి మొగుడి మీదకు రేగింది. 'దీని కంతకూ నీ మెత్తదనమే కారణం.' అని బిగ్గరగా ఏడ్చింది. దొంగతనాలు కట్టినా రంకుతనాలు కట్టినా నీకు పట్టనట్టు కూర్చుంటావు. ఒక్క ఆడదాన్ని నా వల్ల ఏమవుతుంది? అని ఏడ్చింది, కాని కోటయ్య కిం, అనలేదు. కమ్, అనలేదు. తలనిండా ముసుగుపెట్టుకొని పడుకున్నవాడు పడుకున్నట్టే వున్నాడు.

వీరయ్య ఎక్కడెక్కడ తిరిగాడో సాయంకాలం ఇంటికి వొచ్చాడు. వొచ్చీ రావటంతోనే సంగతంతా పసికట్టాడు. కోటయ్య భార్య అతనికి వినబడేటట్లు తిట్లు ప్రారంభించింది. ఆ తిట్లువిని వీరయ్య భార్య జయ్యిన లేచింది తోకతొక్కిన పాముల్లె. ఇద్దరూ మళ్ళీ లడాయి వేసుకున్నారు, పాతపాటే అయినా మళ్ళీ వాడకట్టంతా చుట్టుముట్టింది. వీరయ్యకు కోపంవచ్చింది. "నోరుమూసుకు లోపలకువెళ్ళు." అని గదమాయించాడు భార్యని.

"దొంగతనం చేస్తుంటే!" అని అరచింది.

"ఎవరు దొంగతనం చేసింది?"

"నీ కొడుకు"

"ఎవరు చెప్పారు?"

"నువ్వు చెప్పకపోతే దాగుతుందను కున్నావా ?" అన్నది భార్య.

"ఎవ్వరు చెప్పారు ?"

"రత్తయ్య"

"వాడిమాట ఎందుకు నమ్మా ?"

"ఒకరు చెప్పేదేమిటి. ఇంతంత ఆకు వాళ్ళకాడ ఎక్కడిదీ?" అని కోటయ్య గేదె ముందున్న జనపకాడ చూపించింది.

"వెళుతూ నేనే మన జనపకట్ట నొకటి వేసి వెళ్ళాను. దీని కింత గోలేమిటి" అన్నాడు వీరయ్య.

"చూచారా, చూచారా... ఎంతపన్నాగం పన్నిందో... ఈ గుడిసెలో, మేముండటం ఇష్టంలేక ఇదొకటి వేయించింది— " అని అక్కడ పోగయిన వారందరికి యథార్థాన్ని తెలియ జెప్పింది కోటయ్యభార్య.... చెప్పి మొగుడుదగ్గరకు పరుగెత్తింది.

"చూశారా," అన్నది. ముసుగుపెట్టుకొని పడుకున్న కోటయ్య మాటాడలేదు.

"మీనాన్న వొచ్చాడు, వున్నదివున్నట్టు చెప్పాడు" అన్నది.

"ఏం చెప్పాడు?" అంటూ మంచంమీదనుంచి ఉలికిపడి లేచాడు కోటయ్య.

"మన గేదెకు తన జనపకట్ట తనేవేసి వెళ్లాడట" అన్నది భార్య.

ఈ మాట వినగానే కోటయ్య మళ్ళీ గబుక్కున ముసుగు పెట్టుకొని పడుకొన్నాడు. భార్య పలవలు, తలవలు చేసి చెపుతూనేవుంది. అత్తను తిడుతూనే వుంది. . .అతనుమాత్రం వేసినముసుగు తియ్యలేదు.